# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఎ చరిత్రలో ఒక భాగమని, అవి ఎప్పటికీ తిరిగి రావని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుక విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **కేంద్ర ప్రభుత్వం ఆక్వా పరిశ్రమలను ప్రోత్సహిస్తుందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు.**
4. **తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది.**
5. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ఇళ్లను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించనున్నామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.**

==========================

జమ్మూ కశ్మీర్ లో ఆర్టికల్ 370,ఆర్టికల్ 35 ఎ చరిత్రలో ఒక భాగమని, అవి ఎప్పటికీ తిరిగి రావని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్ రెండో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి కాట్రా, శ్రీనగర్‌లలో నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జమ్మూ కశ్మీర్‌కి రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో వేర్పాటువాదం, ఉగ్రవాదం క్షీణించాయని, వాటిని పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. తొలి విడతగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం హర్షణీయమని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 32 సెకన్లు)

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుక విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానంలో భాగంగా ప్రజలు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు వీలుగా ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌ను ముఖ్యమంత్రి నిన్న ఆవిష్కరించి ఈ మేరకు గనులశాఖ అధికారులు, జిల్లాల కలెక్టర్లతో దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ ఇసుక బుకింగ్‌కు 24 గంటలూ అవకాశం ఉండాలని, ఎవరైనా ఎక్కడి నుంచైనా ఏ సమయంలో అయినా సులువుగా ఇసుక బుక్

చేసుకునేలా పోర్టల్‌ను నవీకరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.కలెక్టర్లు ప్రత్యేక దృష్టిసారించి ఇసుక అక్రమ రవాణాకు, దారిమళ్లించేందుకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని, నిఘా వ్యవస్థను పటిష్ఠపరచాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి మత్యసంపద యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆక్వా పరిశ్రమలను ప్రోత్సహిస్తుందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. నిన్న కృష్ణా జిల్లా పామర్రులోని ఆక్వా పరిశ్రమను కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆక్వా పరిశ్రమను దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించారని తెలిపారు. పరిశ్రమలకి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని చెప్పారు. స్థానికులకు ఉపాధి కలిపించే పరిశ్రమలకి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని కేంద్ర మంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 32 సెకన్లు)

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈ రోజు సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ లో రాష్ట్ర సచివాలయంలో మంత్రి వర్గ సమావేశం కానుంది. ఈ సమావేశంలో పంట నష్టానికి ఆర్థిక సాయం, కొత్త ప్రాంతీయ బాహ్య వలయ రహదారి చట్టం, కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు వంటి పలు అంశాలపై చర్చించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. తెలంగాణలోని పాఠశాలలకు అక్టోబర్ 2 వ తేది నుంచి అక్టోబర్ 14వ వేదీ వరకు దసరా సెలవులను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 2న గాంధీ జయంతితో కలిపి మొత్తం13 రోజులు అన్ని విద్యాసంస్థలకు సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. 15వ తేదీన పాఠశాలలు పున: ప్రారంభమవుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు అక్టోబరు 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

జమిలి ఎన్నికల నిర్వహణ అమలుకోసం కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేయనుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఐదేళ్ల పాటు ఏదో ఒకచోట పోలింగ్ జరుగుతున్నందున ఎన్నికల నియమావళి అమల్లో ఉండటం, తద్వారా విధానపరమైన నిర్ణయాలకు ఆటంకంగా మారాయన్నారు. వేర్వేరుగా ఎన్నికల నిర్వహణ కారణంగా ఖజానాపై ఆర్థికంగా భారం పడుతోందని చెప్పారు. జమిలి ఎన్నికల నిర్వహణకు కేంద్రమంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై.. దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. శాసన సభ, పార్లమెంటుకు ఒకేసారి.. జమిలి ఎన్నికలు జరపాలని నిర్ణయించడం స్వాగతించదగిన పరిణామం అని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నూతన గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు నిన్న ఢిల్లీలో కేంద్ర మంత్రితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భద్రాది కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు అన్ని విధాలుగా అనువైన స్థలాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 1000 ఎకరాల ప్రభుత్వ భూమి విమానాశ్రయం కోసం అధికారులు సిద్ధం చేసినట్లు కేంద్రమంత్రికి తెలిపామని, ఈ మేరకు వినతి పత్రాన్ని అందించామని అన్నారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. నిన్న అనంతపురంలోని స్థానిక ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగంలో కియా సంస్థ విరాళంగా ఇచ్చిన హృద్రోగ చికిత్సా పరికరాలను అనంతపురం శాసనసభ్యులు డి వెంకటేశ్వర ప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వైద్యరంగానికి పెద్ద పీట వేస్తోందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ఇళ్లను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించనున్నామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గుంటూరు జిల్లా పేరేచర్ల హౌసింగ్ కాలనీలో ఉన్న లేఅవుట్లను మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేరేచర్ల హౌసింగ్ కాలనీలో మొత్తం 18వేలకు గాను 11వేల ఇళ్ల నిర్మాణాలను చేపట్టినట్లు వివరించారు. వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ కాలనీల్లో విద్యుత్తు, రహదారులు, తాగునీరు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

======================